

ఇంటర్ పరీక్షలకు 63 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఇంటర్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ-2, కామర్స్-2, ఒకేషనల్ పరీక్షలకు సంబంధించి 63మంది గైర్హాజరయ్యారని పరీక్షల కస్టోడియన్ అధికారి డి.విజయ కుమార్ శనివారం తెలిపారు. మండలంలో డాక్టర్ మోకా గణపతి రావు ప్రభుత్వ జూనియర్ , తార జూనియర్ కళాశాలలు, అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన మొత్తం 603 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 540 మంది పరీక్షకు హాజరయ్యారుని, 63 మంది గైర్హాజరయ్యారన్నార. డాక్టర్ ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 91 మందికి 84 మంది హాజరు కాగా 7గురు, తార కళాశాలలో 161 మందికి 144 మంది హాజరు కాగా 17 మంది, గురుకుల పాఠశాలలో 196 మందికి 179 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 155మందికి 133 మంది హాజరు కాగా 22మంది గైర్హాజరయ్యారన్నారు.

వరిపై తెగుళ్ల దాడి

- రైతులకు పలు సూచనలు చేసిన వ్యవసాయ శాఖ అధికారులు



ఈనిక దశకు చేరుకున్న వరిచేలు(ఇన్‌సెట్)లో కాండం కుళ్ళు తెగులు సోకిన దుబ్బు

ప్రజాశక్తి - రామచంద్రపురం

దాళ్వా వరి చేలు ప్రస్తుతం ఈనిక దశ కు చేరుకున్నాయి. ప్రస్తుతం కాండం కుళ్ళు తెగులు అక్కడక్కడ కని పిస్తోంది. కణువుల మధ్య భాగమంతా నల్లగా, కుళ్ళు పసుపు రంగుకి మారడం, పిలకలు కిందికి వాలిపోయి ఎండి పోవుట, క్రమంగా దుబ్బు అంతా ఎండి పోవుట, వెన్నుల్లో తాలు గింజలు ఏర్పడుట, పూర్తిగా ఎండిన పిలకలను చీల్చి చూసినచో లోపలి భాగం లో నల్లని చిన్న చిన్న శిలీంధ్ర బీజాలుకనిపించుట వ్యాధి లక్షణాలు.

నివారణ..తెగులు సోకిన పొలంలో పరిశుభ్రత పాటించాలి. గత పంట మోళ్ళు, పంట అవశేషాలు తొలగించాలి. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. విత్తన శుద్ధి చేయాలి. పైరు ఆరోగ్యంగా పెరిగేలా పోషకాలు అందించాలి. కాండం కుళ్ళు తీవ్రత ఎక్కువగా ఉంటే పొలం నుండి నీటిని పూర్తిగా తొలగించి ఒకసారి ఆరనివ్వాలి. ప్రారంభ దశలో తెగులు లక్షణాలు గుర్తించి హెక్సాకొనజోల్ 5 ఎస్‌సి. 2 మిలీ లేదా వాలిడామైసిన్ 3 ఎల్ 2 మిలీ లేదా ప్రొపికొనజోల్ 25 ఇసి 1 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ 25.9 ఇసి 2 మిలీ. లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని 15 రోజుల కొకసారి 2 సార్లు పిలకలు కింద వరకు తడిచేలా పిచికారి చేయాలి. కాండం కుళ్ళు తెగులు ఆశించిన పంటను కోసేటప్పుడు మొదళ్ళ వరకు కోయాలి. కంబైన్ హార్వెస్టర్ వంటి కోత యంత్రాలతో కోసేటప్పుడు మొదళ్ళ వరకు కోయడం మంచిదని వ్యవసాయ శాఖ అధికారి తెలియజేస్తున్నారు..

సుడిదోమ.. గోధుమ వర్ణపు/ తెల్లమచ్చ దోమలు నీటి వసతి గల పొలాల్లో పంట అంకురార్పణ దశ నుంచి ఎక్కువగా ఆశిస్తాయి. వీటి తల్లి పురుగులు గోధుమ రంగు నుంచి ముదురు గోధుమ రంగులో ఉంటాయి. ఈ దోమలు 6-12 గుడ్లను సముదాయాలుగా కాండం ఒరలలోనూ, కాండం కణజాలంలో చొప్పిస్తాయి. గుడ్లు ఒకదానితో ఒకటి అతుక్కుని ఉంటాయి. ఒక ఆడ దోమ 300-500 వరకు గుడ్లను పెడతాయి. ఈ గుడ్లు 6-9 రోజులలో పొదగబడి, గుడ్ల నుంచి వెలువడిన పిల్ల పురుగులు 5 దశలలో పెరిగి 10-18 రోజులలో గోధుమ రంగులోనికి మారుతాయి. ఈ దోమలు తమ జీవిత కాలాన్ని 12-23 రోజులలో పూర్తి దశకు చేరుకుంటాయి. నష్టం పిల్ల, తల్లి దోమలు దుబ్బుల మొదళ్ల నుండి రసం పీలుస్తాయి. ఇవి రసాన్ని పోషకాలను నిరంతరం పీల్చటం వలన మొక్కల మొదలు పసుపు రంగుకు మారి క్రమేపీ పైరు సుడులు సుడులుగా ఎండిపోతుంది. ఈ విధంగా పొలంలో మొక్కలు సుడులు సుడులుగా ఎండిపోవటాన్ని సుడి తెగులు అంటారు. దోమ ఉధృతి ఎక్కువగా ఉంటే సుడులు ఒకదానితో ఒకటి కలిసి చేను అంతా ఎండి పోతు ంది. దోమ అభివృద్ధికి అనుకూల మయిన పరి స్థి తులు గాలిలో అధిక తేమ (90శాతం), అధిక ఉష్ణోగ్రత (25-32శాతం సె) అధిక నత్రజని ఎరు వుల వినియోగం, నాట్లు దగ్గరగా నాటడం, విచక్షణా రహి తంగా పురుగుమందులు వాడకం .

నివారణ.. తట్టుకునే రకాలు సాగు చేయాలి. పొలాన్ని అడపా దడపా ఆరబెట్టాలి. ప్రతి రెండు మీ. నాట్లకు 20 సెంమీల కాలి బాటలు వదలాలి. ఎసిఫేట్ 75 యస్‌పి. 1.5 గ్రా. లేక పైమెట్రోజైన్ 50 డబ్ల్యుజి. 0.6 గ్రా లేదా డైనోటెఫ్యురాన్ 20 ఎస్‌జి 0.4 గ్రా. లేదా ట్రైఫ్లుమిజో పైరిమ్ 10 యస్‌సి 0.48 మిలీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దోమ ఉధృతికి దోహదపడే పురుగు మందులైన క్వినాల్ ఫాస్, ప్రొఫెనోఫాస్, మిథైల్ పారథియాన్, ట్రైజోఫాస్ ఫోరేట్ 10 జి గుళికలు, సింథటిక్ పైరిత్రాయిడ్ వర్గానికి చెందిన డెల్టామెత్రిన్ మరియు సైపర్ మెత్రిన్ మొదలగు పురుగు మందులను వాడరాదు.

తెగుళ్ళ పై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

దాళ్వా వరి చేలలో వ్యాపిస్తున్న తెగుళ్ళ పై రైతులకు పొలం పిలుపుతో కార్యక్రమంలో ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి బలుసు రవి తెలిపారు. రైతులు వరి చేల కు మోతాదు మించి ఎరువులు పురుగుమందులు ఉపయోగించరాదని దీనివల్ల అధిక ఖర్చుతో పాటు పంట చేలకు నష్టం చేకూరుతుందని ఆయన వివరించారు. పొలాలలో వ్యాధులు వ్యాప్తి చెందుతున్న విషయాన్ని గమనించిన రైతులు మండల వ్యవసాయ శాఖ అధికారులు సంప్రదించి సలహాలు సూచనలు పొందాలని 'ప్రజాశక్తి' ఆయన వివరించారు.

లబ్ధిదారులకు చెక్కుల అందజేత

ప్రజాశక్తి - రావులపాలెం

పిఎం అనుసూచిత జాతి అభ్యుదయ యోజన పథకం లబ్దిదారులకు, స్వయం సహాయక సంఘాలకు ఎంఎల్ఎ బండారు సత్యానందరావు చెక్కులను పంపిణీ చేశారు. శనివారం స్థానిక కొత్తకాలనీలో మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఎంఎల్ఏ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూమహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్ది, అన్ని రంగాల్లో భాగస్వాములను చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గుత్తుల పట్టాభి రామారావు, నందం వీరవెంకట సత్యనారాయణ, పడాల బులి కొండారెడ్డి, కాసా సాగర్, మాసాబత్తుల ఆనందరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్స్, సభ్యులు పాల్గొన్నారు.





జడ్‌పి సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఛైర్మన్ వేణుగోపాల్, సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి

మొక్కుబడిగా జడ్‌పి సమావేశం

- మంత్రులు, అధికారుల డుమ్మా
- అరకొర అంశాలకే పరిమితం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జడ్‌పి బడ్జెట్, సాధారణ సమావేశాలు ఈసారి కూడా మొక్కుబడి తంతుగానే ముగిశాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు గానీ, కొందరు కీలక శాఖల అధికారులకు గాని హాజరు కాక పోవడంతో సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీంతో సమావేశం కొన్ని అంశాలకే పరిమితం కాగా మధ్యాహ్నం తర్వాత ముగించేశారు. ఎంఎల్‌సిలు ఐ.వెంకటేశ్వరరావు, తోట త్రిమూర్తులు వంటి వారు అడిగిన ప్రశ్నలకు అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎల్‌సి ఐవి వెయిటింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు గురించి ప్రశ్నించారు. జిల్లాలో 91 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉందని, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు అంగీకరిస్తే వెంటనే ఇస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా వెయిటింగ్‌లో ఉన్న 2500 మందికి ఇతర ప్రభుత్వ శాఖలలో కారుణ్య నియామకాలు ఇచ్చే దానికి సంబంధించిన ఫైలు సిఎంఒకి వెళ్లినట్లు జడ్‌పి సిఇఒ తెలిపారు. జడ్‌పి, మండల పరిషత్ ఉపాధ్యాయులకు 2023 -24 పిఎఫ్ స్లిప్పులు వెంటనే విడుదల చేయాలని కోరగా ఏప్రిల్ 25 నాటికి విడుదల చేస్తామని సమాధానం ఇచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు సమస్యలను సమావేశం దృష్టికి ఐవి తీసుకొ చ్చారు. సమావేశాలకు ముఖ్య అధికారులు హాజరు కాకపోవడంపై ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు, హాజరు కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గత సమావేశంలో కూడా దీనిపై తాను ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదన్నారు. దీనిపై కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఇద్దరు కలెక్టర్లు సమావేశానికి హాజరు కాకపోవడంపై వివరణ ఇచ్చారు.

బడ్జెట్‌కు ఆమోదం

2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.70 లక్షలు మిగులుతో రూ.1014 కోట్ల బడ్జెట్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సభ్యులు ఆమోదించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 2024-25 సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌ను, 2025-26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను చర్చించి ఆమోదించారు. 2024-25 సంవత్సరానికి సవరిం చిన ఆదాయం రూ.846.60 కోట్లు, సవరించిన వ్యయం రూ. 845.95 కోట్లతో రూ.65 లక్షల మిగులుతో రివైజ్డ్ బడ్జెట్‌ను ఆమోదించారు. అలాగే రానున్న 2025-26 ఆర్థిక సంవత్సరానికి అన్ని పద్దు లు కలుపుకుని మొత్తం ఆదాయ అంచనా రూ.1013.80 కోట్లు కాగా, అన్ని పద్దుల కింద అం చనా వ్యయం రూ.1013.10 కోట్లతో, రూ. 70 లక్షలు మిగులు బడ్జెట్ ను సర్వ సభ్య సమావేశం ఆమోదించింది. ఆదాయంలో జడ్‌పి సాధారణ నిధు లు రూ.28 కోట్లు, ప్రభుత్వం నుంచి కేటాయించే శాలరీ గ్రాంటులు రూ.10.48 కోట్లు, నిర్దిష్ట ప్రయోజన గ్రాంట్లు రూ.46.09 కోట్లు, డ్వామా, గ్రామీణ నీటి సరఫరా, ఇతర శాఖల ద్వారా వచ్చే గ్రాంట్లు రూ.922.39 కోట్లుగా ఉన్నాయి. జడ్‌పి సాధారణ నిధుల నుంచి షెడ్యూల్ కులాల సంక్షేమానికి 15 శాతం కేటాయింపులో భాగంగా రూ.2.97 కోట్లు, షెడ్యూల్ తెగల సంక్షేమానికి 6 శాతం కేటాయింపులో భాగంగా రూ.1.19 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి 15 శాతం కేటాయింపులో భాగంగా రూ. 2.97 కోట్లు, అభివృద్ధి పనులకు 23 శాతం కేటాయింపులను సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో జడ్‌పి వైస్ ఛైర్మన్లు బుర్రా అను బాబు, మెరుగు పద్మలత, సిఇఒ వివివి ఎస్.లక్ష్మణ రావు, డిప్యూటీ సిఇఒ రామ్‌గోపాల్, ఎఒ ఎం.బుజ్జి బాబు, జడ్‌పిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై అవగాహన



అమలాపురంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈస ందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అవగాహనా ర్యాలీలు, ప్రతిజ్ఞలు చేశారు.

అమలాపురం: ప్లాస్టిక్ సంచులకు బదులుగా జ్యూట్,క్లాత్, పేపర్ బ్యాగులను వినియోగించాలని జిల్లా ఇన్చార్జ్ అధికారి పి.రవి సుభాష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని రైతు బజార్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి అధికారి పి.రవి సుభాష్ పాల్గొన్నారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. అంతకుముందు కలెక్టరేట్ అధికారులు సిబ్బందిచే స్వచ్ఛాంద ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో అమలాపురం మున్సిపల్ ఛైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, అమ్ముడా ఛైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, అమలాపురం మున్సిపల్ కమిషనర్ కెవిఆర్.రాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్, ఎడి మార్కెటింగ్ విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించే దిశగా అధికారులంతా ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఇన్‌ఛార్జ్ అధికారి పి రవి సుభాష్ ఆదేశించారు. కలెక్టరేట్లోని గోదావరి భవన్లో జిల్లాలో వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న ఫ్లాట్ షిప్ కార్యక్రమాల అమలు తీరుపై జిల్లా ఇన్చార్జ్ అధికారి సమీక్షించారు. కార్యక్రమంలో జెసి టి.నిషాంతి, పీడీ డిఆర్‌డిఎ డాక్టర్ శివ శంకర ప్రసాద్, పీడీ డ్వామా మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, సిపిఒ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. **పి.గన్నవరం** : మన ఊరు భవిష్యత్తు మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే నిజమైన సమాజసేవ అని పి.గన్నవరం ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. సర్పంచ్ కుసుమ చంద్రకళ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి, శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో నిరంతరం శ్రమిస్తూ పరిశుభ్రత కోసం పాటుపడుతున్న పారిశుధ్య కార్మికులను సత్కరించడం అభినందనీయమన్నారు. ఎంపిడిఒ కెవి.ప్రసాద్ మాట్లాడుతూ ముంగండ హైస్కూల్ విద్యార్థులు 2కె రన్ నిర్వహించి గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అంబటి భూలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** అంగరలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రత్నకుమారి పాల్గొని మాట్లాడారు. మాచర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రమాదేవి ఆధ్వర్యంలో పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగర గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ ఎర్ర వీరన్న బాబు, మండలపరిషత్ ఎఒ రాజేంద్రప్రసాద్, తది తరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** చింతలూరులో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆర్‌డిఒ పి.శ్రీకర్, డిఎస్‌పి సుంకర మురళి మోహన్‌లతో కలిసి ఎంఎల్‌ఎ బండారు సత్యా నందరావు పాల్గొన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను వారంతా చేసి, స్థానిక పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే విధంగా స్టెయిన్లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లను, క్లాత్ బ్యాగులను సత్యానందరావు ఉచితంగా పంపిణి చేశారు. కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** దైనందిన కార్యక్రమాలలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుని ఆరోగ్యాన్ని పరి రక్షించుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఎం.ఎ.షంషీ సూచించారు. గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో శనివారం సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అధ్యక్షతన స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులు, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పిఎస్ రాజ్ కుమార్, ఎంఇఒ సత్తి సత్య కృష్ణ, ఎఒ ఎంఎల్‌ఎన్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి అడబాల శ్రీరామ చంద్రమూర్తి,ఉ పాధి ఫీల్డ్ అసిస్టెంట్ ముళ్ళ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ఉపాధి కూలీలు పాల్గొన్నారు. **రామచంద్రపురం**: ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కషి చేయాలని మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ నాయుడు కౌన్సిలర్లు కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ద్రాక్షారామ గ్రామ పంచాయతీ పరిధిలో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై అవగాహనా ర్యాలీ, ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలను సర్పంచ్ కొత్తపల్లి అరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ కొత్తపల్లి అరుణ, సెక్రెటరీ పెట్టా సత్యనారాయణ, సచివాలయ, అంగన్‌వాడీ ఆరోగ్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. ఎర్రపోతవరంలో గ్రామ సర్పంచ్ పిల్లి రాంబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు గ్రామ కార్యదర్శి జయ రాజు, మాజీ సొసైటీ అధ్యక్షులు సాపిరెడ్డి దొరబాబు, ఉప సర్పంచ్ మణి బబు, తదితరులు పాల్గొన్నారు. **అల్లవరం:** సర్పంచ్ బొమ్ము బాలవేణి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివారణ కొరకు గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాలలో ర్యాలీ చేసి ప్రతిజ్ఞ చేయించారు.. కార్ర్యమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ డి.రాంబాబు, తహాశీల్దార్ వివియల్.నర సింహ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.లక్ష్మణరావు, ఇఒపిఆర్‌డి యు.నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి ఎస్ రాజమోహన్, ఎంపిటిసి, వార్డు సభ్యులు, సచివాలయం, పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. కొమరగిరిపట్నం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విషయ మై మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎఇ స్వామి, గ్రామ వార్డు సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ కమిటీ నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, డ్వాక్రా యానిమేటర్స్, హెల్త్, పంచాయతీ కార్యద్శి, సిబ్బంది పాల్గొన్నారు. **మామిడికుదురు:** స్థానిక దీప్తి డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థులు మామిడికుదురు లో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డివివి.సత్యనారాయణ మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త పొడి చెత్తను సేకరించి శుభ్రం చేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం కో-ఆర్డినేటర్లు పొన్నమండ సుబ్బారావు, వాసంశెట్టి నాగరాజు, అడబాల ఈశ్వరరావు, కడలి మురళి శ్రీనివాస్, వీరా కొండలరావు తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** బొబ్బర్లంక గ్రామంలో స్వర్ణాంధ్ర ,స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ బికెఎస్ ఎస్.వెంకట రామన్, అంగన్‌వాడీ టీచర్, ఎఎన్ఎం, విద్యార్థులతో గ్రామ ప్రజలతో ర్యాలీ నిర్వహించి అందరితో ఎంపిడి ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛభారత్ లో భాగంగా డస్ట్ బిన్స్ ను ప్రజలకు పంపిణీ చేశారు. **ముమ్మిడివరం**: అనాతవరం పంచాయతీ పరిధిలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఎస్ డబ్ల్యు పిసి షెడ్డును జిల్లా ఇన్‌ఛార్జి అధికారి పి.రవి సుభాష్ పరిశీలించారు. కార్యక్రమంలో జెసి టి.నిషాంతి జిల్లా పంచాయతీ అధికారి డి.శాంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చింతలూరులో ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్‌ఎ సత్యానందరావు



దీప్తి డిగ్రీ కళాశాల విద్యార్థుల అవగాహనా ర్యాలీ



ముంగండలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎంఎల్‌ఎ గిడ్డి




గొల్లవిల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ, అధికారులు



రామచంద్రపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్, అధికారులు

కార్టూ'నిజం'



అన్యాయం చేసిన అధికారులను బట్టలూడదీసి నిలబెడతాం



నటుడు శ్రీకాంత్‌కు చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న నటుడు శ్రీకాంత్

ప్రజాశక్తి - రాజోలు

సఖినేటిపల్లి మండలంలోని అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మి నరసింహస్వామిని సినీ నటుడు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భ:గా ఆయనకు అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు వేదాశీర్వచనం అందించారు. వీరికి ఆలయ అర్చక స్వాములు శ్రీస్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు ..

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - యంత్రాంగం

టెన్త్ పబ్లిక్ పబ్లిక్ పరీక్షలు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాశాఖ అధికారులు శనివారం తెలిపారు. వివరాలు ఇవి..

ఆత్రేయపురం: టెన్త్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకూ నిర్వహించనున్నారని, ఈ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ పి.వరప్రసాదరావు తెలిపారు. మండలంలో బాలురు 264, బాలికలు 303 కలిపి మండలంలో 567 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నరని అన్నారు. మండలంలోని ఆత్రేయపురం, పేరవరం, ర్యాలీ, గ్రామాలలో మూడు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు . రాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 229 మంది విద్యార్థులు, పేరవరం జడ్‌పి ఉన్నత పాఠశాల లో 144 మంది విద్యార్థులు, ఆత్రేయపురం మహాత్మా గాంధీ ఎయిడెడ్ పాఠశాలలో 194 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. **మామిడికుదురు:** టెన్త్ పరీక్షలకు మామిడికుదురు మండల పరిధిలో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ లక్ష్మీనారాయణ తెలిపారు 1,052 రెగ్యులర్ విద్యార్థులతోపాటు 9 మంది ప్రయివేటు విద్యార్థులు మొత్తం 1,061 మంది విద్యార్థులు పరీక్షలుకు హాజరు కానున్నారన్నారు. మొగలికుదురు కేంద్రంగా 234 మంది, మొగలి కుదురు చైతన్య టెక్నో స్కూల్ కేంద్రంగా 211 మంది, లూటుకుర్రు కేంద్రంలో 198 మంది, మామిడికుదురు కేంద్రంలో 164 మంది, పాశర్లపూడి బాడవ కేంద్రంగా 170 మంది, అప్పనపల్లి కేంద్రంగా 84 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు పరీక్ష లకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చమని తెలిపారు**అంబాజీపేట:** మండల పరిధిలో 7 ప్రభుత్వ, 4 ప్రయివేటు పాఠశాలలో చదువుచున్న మొత్తం విద్యార్థులు 457 మంది మూడు పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఇఒలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు తెలిపారు. అంబాజీపేట కేంద్రం నందు 71 బాలురు, 65 మంది బాలికలు 136 మంది, పుల్లేటికుర్రు కేంద్రంలో 96 మంది బాలురు, 96 మంది బాలికలు మొత్తం192 మంది, తొండవరం పరీక్షా కేంద్రంలో 76 మంది బాలురు, 53 మంది బాలికలు మొత్తం 129 మంది, పరీక్షలకు హాజరవుతున్నారన్నారు.9 గంటల లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.వీరిలో నలుగురు సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు ఉన్నారన్నారు.

సృజనాత్మకతను పెంపొందించేందుకు కృషి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

విద్యార్థులలో ఉన్న సృజనాత్మ కతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కషి చేయాలని జిల్లా సహకార శాఖ అధికారి ఎస్.మురళీకృష్ణ సూచించారు.2025 అంత ర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా శనివారం భీమనపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలోని 8,9 తరగతి విద్యార్థులకు గ్రామీణాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిం చారు. ఈ పోటీల్లో కె.భవ్యశ్రీ ప్రథమ, సిహెచ్.కీర్తిశ్రీ ద్వితీయ, కె.గీతిక తృతీయ స్థానాలను సాధించారు. విజేతలకు జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ బహుమతులు అందజేసి దేశవ్యాప్తంగా ఈ ఏడాది అన్ని సహ కార సంఘాలు అనేక కార్యక్రమాలు చేపట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సహకార అధికారి ఎన్.రాధా కృష్ణారావు, జిల్లా ట్రైనింగ్ ఇన్‌ఛార్జ్ ఆదిమూలం వెంకటేశ్వ రరావు, ఎంఇఒ కె.కిరణ్‌బాబు సహకార సం ఘాల సిఇఒ లు పోలిశెట్టి దుర్గాప్రసాద్, చిక్కం లింగయ్య నాయుడు, ఎంవివి.సత్యా నందం, కె.శ్రీనివాసరాజు, ఆకుల సూరిబాబు, గణేశ్వ రరావు, ఎన్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ

విషాదభరితం చిన్నారుల హత్యోదంతం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అభం శుభం తెలియని ముక్కు పచ్చలారని ఇద్దరు చిన్నారులను అతి పాశవికంగా కళ్లకు గంతలు కట్టి, కాళ్లు, చేతులు కట్టి, రెండు చేతులను వెనక్కి వంచి కదలకుండా చేసి బకెట్లలో నీటిలో ముంచి ఊపిరి ఆడకుండా చేసి హతమార్చారు. ఇంతటి దారుణానికి ఒడి కట్టింది ఎవరో ప్రొఫెషనల్ కిల్లర్ కాదు. సాక్షాత్తు చిన్నారులకు జన్మనిచ్చిన కన్నతండ్రే.. ఆ తర్వాత తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు అవాక్కయ్యారు. నీటి తొట్టెలో ముంచి చంపిన దృశ్యం చూసి చలించిపోయారు. శనివారం కాకినాడ జిజిహెచ్‌లో ఇద్దరు చిన్నారులు, మృతుడు చంద్రకిషోర్ మృతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. సర్పవరం ఎస్‌హెచ్‌ఒ బి.పెద్దిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొఫెషనల్ కిల్లర్ మాదిరి తండ్రి

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన వానపల్లి చంద్రకిషోర్ (37) ఎంకామ్ చేసిన అనంతరం ఎంబిఎ పూర్తి చేసి విద్యాభ్యాసం చేశాడు. కాకినాడ అర్బన్ 2వ డివిజన్ తోట సుబ్బారావునగర్ రోడ్డు నెంబర్ -2, రామనాయపేట భూదేవి అపార్ట్‌మెంట్లో త్రిబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లో నివాసం ఉంటున్నారు. ఇతనికి 9 ఏళ్ల క్రితం తనూజాతో పెద్దలు వివాహం జరిపించారు. వీరికి ఆరేళ్ల వానపల్లి జోషిల్, అయిదేళ్ల నిఖిల్ కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడ్ని కాకినాడలో ప్రముఖ స్కూల్లో ఎల్‌కెజీలో చేర్పించగా యుకెజి వరకూ అందులోనే చదివారు. ఫీజు లక్షల్లో ఉండటంతో గేడెడా ఏడాదికి రూ.50 వేల ఫీజు ఉండే స్కూల్లో ఇద్దర్ని రూ.లక్ష కట్టి జాయిన్ చేశాడు. పెద్దస్కూల్ నుంచి చిన్నస్కూల్లోకి మార్చేశాను, భవిష్యత్తులో లక్షలు కట్టి పిల్లల్ని చదివించగలనా, స్థాయి తగ్గించేశానా అనే ఆలోచన చంద్రకిషోర్ ఎవరికీ చెప్పలేక ఆత్మన్యూనతా భావానికి లోనై క్షణికా వేశంలో ముక్కుపచ్చలారని ఇద్దరు పిల్లల్ని కర్కసంగా కళ్లకు గంతలు కట్టి, కాళ్లు, చేతులు కదలకుండా రెండు ప్లాస్టిక్ బకెట్లలలోనీరు పోసి అందులో ముంచేసి ఊపిరి ఆడకుండా చేసి మరీ హత్య చేసి, తానూ కూడా ఆత్మహత్య చేసుకున్నాడు.

గొల్లపేటలో చోరీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలో వరుస దొంగతనాలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. కొన్ని రోజుల క్రితం వృద్ధిరాలి మెడలో గొలుసు అపహరించిన సంఘటన మరువకముందే ధవళేశ్వరంలోని జిటిపిఎస్ క్వార్టర్స్ వెనకాల గొల్లపేటలో చోరీ చోటు చేసుకుంది. ఇంటి యజమాని చొప్పర హరీష్ గురువారం ఊరు వెళ్లారు. తిరిగి శనివారం మధ్యాహ్నం వచ్చి చూడగా తలుపు గెడ పెకలించి ఉండడంతో అనుమానం వచ్చి వెనక వైపు చూడడంతో తలుపు తెరచి ఉంది. దీంతో ధవళేశ్వరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిఐ టి.గణేష్, ఎస్ఐ క్రాంతి సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో ఉన్న వెండి వస్తువులు, నగదు, స్మార్ట్ టీవీ అపహరించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సాయంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకోవాలని పసలపూడి సర్పంచ్ కట్టా లక్ష్మి లబ్ధిదారులకు సూచించారు. శనివారం గ్రామంలో ఎంపిడిఒ విడివిఎస్.రామారావు ఆధ్వర్యంలో ఓల్డ్ స్వలా ఇందిరమ్మ కాలనీలో లబ్ధిదారులకు అవగామన కార్యక్రమం నిర్వహించారు అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయని లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసుకోవాల న్నారు. హౌసింగ్ ఎఇ పి.ఏడుకొండలు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు మొత్తం 914 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. ఇఒపిఆర్‌డి కె.ఆంజనేయ శర్మ, మండల ప్రత్యేకాధికారి ఎం.సందీప్, ఎపిఎం టి.బాల కోటయ్య పాల్గొన్నారు.

హెక్టార్ వెదురుకు రూ.1.20 లక్షల రాయితీ

ప్రజాశక్తి-రాజానగరం

జాతీయ వెదురు మిషన్ కింద హెక్టార్‌కు రూ.1.20 లక్షల రాయితీ ఇస్తున్నారని హార్టీకల్చర్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.దేవముని రెడ్డి అన్నారు. స్థానిక జిఎస్ఎల్ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి వెదురు సాగు మార్కెటింగ్ విలువ ఆధారిత ఉత్పత్తులపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉద్యాన అధికారి బి.సుజాత కుమారి అధ్యక్షత నిర్వహించిన సభలో దేవముని రెడ్డి మాట్లాడుతూ ఆర్ఒఎఫ్ఆర్ భూమికి 90 శాతం రాయితీ, నర్సరీ హెక్టార్‌కు రూ.20 లక్షలు ప్రాథమిక ప్రాసెసింగ్‌తో మౌలిక సదుపాయాలకు 50 శాతం రాయితీ ఇస్తున్నారని చెప్పారు. స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ బి.విజయ కుమార్ మాట్లాడుతూ నేషనల్ బాంబూ మిషన్ 2006లో మొదలు పెట్టగా 2019 వరకు వెదురును అటవీ ఉత్పత్తులుగా పరిగణించారన్నారు. దాని వల్ల వెదురు ఉత్పత్తిపై అమ్మకానికి అటవీ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి కాబట్టి రైతులు ఇబ్బంది పడటం వల్ల 2019లో పునరుద్ధరించారని తెలిపారు. కల్లం మూల వెదురు అనే జాతి తప్ప మిగతా జాతి వెదురులకు అనుమతి అవసరం లేదని తెలిపారు. ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ బివి.హరగోపాల్, వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మెప్మా ఆధ్వర్యంలో ట్రయాంగిల్ సంస్థ ద్వారా ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయా వృత్తుల కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఎలక్ట్రికల్ శిక్షకులు చింతల సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో కార్పెంటర్ వేముల అర్జునరావు అధ్యక్షతన జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 8 రోజుల పాటు జరిగే ఈ శిక్షణా తరగతులు ఈనెల 18వ తేదీతో ముగిస్తాయన్నారు. శిక్షణ పొందిన కార్మికులకు సర్టిఫికెట్‌తో పాటు రూ.4 వేలు విలువచేసే పనిముట్ల అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాడిశెట్టి గంగ, లంక చంటి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల మోత..కోతల వాత...



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యుత్ బిల్లులు మోత మోగుతున్నాయి. ట్రూ అప్, సర్ ఛార్జీల తదితర పేర్లతో విద్యుత్ సంస్థలు యథేచ్ఛగా వసూళ్లు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిన విషయం విదితమే. దీంతో బిల్లులు ఆకాశాన్నంటుతున్నాయి. సాధారణంగా ప్రతి నెలా రూ.900 నుంచి రూ.1000 చెల్లించే గృహ వినియోగదారులు రూ.1500కు పైగా బిల్లులు వస్తున్నాయి. షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, పరిశ్రమల యజమానులు ప్రభుత్వం చుక్కలు చూపిస్తుందంటూ వాపోతున్నారు. మరోవైపు పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవటంతో విద్యుత్ కోతలు అనివార్యంగా మారాయి. దీంతో పల్లెలతో మొదలైన విద్యుత్ కోతలు ప్రస్తుతం పట్టణాల్లోనూ ఎడా పెడా అమలవుతోంది. దీంతో ఉక్కపోత.. ఉమ్మదీతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఆక్వా రంగానికి విద్యుత్ కోతలు శాపంగా మారాయి. చేపలు, రొయ్యలను బ్రతికించుకునేందుకు లక్షలు వెచ్చించి డీజిల్ మోటార్లతో ఏరియేటర్లతో ఆక్సిజన్ అందిస్తున్నామంటూ నిర్వాహకులు వాపోతున్నారు. ప్రజల, అవసరాలకు తగ్గట్లుగా సరఫరా అందించటంలో పాలకులకు చిత్తశుద్ధి కొరవడిందని, బిల్లుల వసూళ్ల పేరుతో వినియోగదారుల గోళ్లూడ పీకుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రహదారుల రక్త సిక్తం...

జాతీయ రహదారులు అంతర్జాతీయ స్థాయిలో ఆధునీకరణ తమ హయాంలోనా జరుగుతోందంటూ ప్రకటనలు గుప్పిస్తున్న కేంద్ర ప్రభుత్వ డొల్లతనానికి రోడ్లు ప్రమాదాల దర్పణం పడుతున్నాయి. జిల్లాలో అనేక రహదారులు రక్త సిక్తంగా మారుతున్నాయి. గత నెలలో రాజమహేంద్రవరంలో ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొని ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన మరవక ముందే ఏలూరులో ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఆగివున్న లారీని ఢీ కొట్టడంతో కాకినాడకు చెందిన ప్రయాణికులు మృతి చెందారు. ఆదే విధంగా నల్లజర్ల హైవేపై రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్నపుడు రోడ్డుపై లారీ నిలిపిన డ్రైవర్లును నిందితునిగా చేరుస్తూ పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవటం పలు విమర్శలకు దారి తీస్తోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 50కి పైగా బ్లాక్ స్పాట్‌లు ఉన్నట్లు అధికార యంత్రాంగం చెపుతోంది. ఈ ప్రాంతాలపై ప్రమాదాలకు తీసుకున్న చర్యలు శూన్యమని జరుగుతున్న ప్రమాదాలు దర్పణం పడుతోంది. హైవే పెట్రోలింగ్ వ్యవస్థ అలంకార ప్రాయంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జాతీయ రహదారులకు సమీపంలో డ్రైవర్లకు విశ్రాంతి గదులు, మరుగుదొడ్ల నిర్వహణ వంటివి పూర్తిగా నేతి బీర చందంగా మారాయి. ఫలితంగా భారీ వాహనాలు రోడ్లుకు ఇరువైపులా పార్కింగ్ చేసి డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవటం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు కళ్లు తెరిచి ప్రమాదాల నియంత్రణకు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

జనసైనికుల్లో నూతనోత్సాహం

జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాలో నిర్వహించిన సభ ఆ పార్టీ శ్రేణులలో నూతనోత్సాహాన్ని నింపింది. జిల్లాలోని జనసేన కార్యకర్తలతో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు అభిమానులు చిత్రాడకు చేరుకోవటంతో సభా ప్రాంగణం కిటకిటలాడింది. అక్కడక్కడా కొన్ని చెదరుమదురు ఘటనలు మినహా ఆద్యంతం సభ సజావుగా సాగింది. పవన్ కల్యాణ్ ప్రసంగం ఆద్యంతం ఆత్మస్తుతి పరనింద అన్నట్లుగా సాగిందనే విమర్శలు విన్పించాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడిచినా కీలక హామీలు ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు ఊసేలేదు. ఈ సమస్యల ప్రస్తావన, పరిష్కారానికి తన చొరవ గురించి ప్రస్తావించలేదు. కేవలం ఆ పార్టీ 11 సంవత్సరాల ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న ఒడిదుడుకులను వివరించి మమ అనిపించారు. మరో వైపు పవన్ కల్యాణ్ అభిమానులకు ఎప్పటిలానే నిరాశ తప్పలేదు. కార్యకర్తలతో పాటు కొంత మంది నియోజక వర్గ నేతలకు సైతం అధినేతను కలిసే అవకాశం లభించకపోటం విమర్శలకు దారి తీస్తోంది.

సిపిఎం ప్రజా చైతన్య యాత్రలు

సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు ప్రజా సమస్యలు వింటూ ముందుకు సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా కేంద్రమైన కాకినాడలో గత వారంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొని ప్రజా చైతన్య యాత్ర ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గత వారంలో రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు ఇంటి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుస్తున్నాయి. ఈ సందర్భంగా ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఒకొక్కటిగా వివరిస్తున్నారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీలను సైతం విస్మరించిదంటూ ఏకరువు పెడుతున్నారు. నిరసనగా తమ గళాన్ని విన్పిస్తున్నారు.

పలువురికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి పొడగట్లపల్లిలో ఉచిత మెగావైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు చేశారు. శనివారం ఉప్పలపాటి జానకియమ్మ అన్నదాన సత్రంలో అవిడి సత్యం జ్ఞాపకార్థం ఎన్‌టిఆర్ ట్రస్ట్, జిఎస్ఎల్ ఆసుపత్రి, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అవిడి బాలనాగ గణపతి, శ్రీవిద్య దంపతులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టిడిపి తెలుగు యువత బండారు సంజీవ్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు ఈ మెగా వైద్య శిబిరం స్థానికులకు వివిధ వైద్య సేవలు ఉచితంగా అందించడానికి అవిడి గణపతి దంపతులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఎన్‌టిఆర్ ట్రస్టు ద్వారా రూ లక్ష విలువచేసే మందులు ఉచితంగా అందజేశారు. వైద్య శిబిరంలో వందల సంఖ్యలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఎన్‌టిఆర్ ట్రస్ట్, జిఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, సేవా కార్యక్రమ నిర్వాహకులకు అతిథులకు అవిడి సత్యం మనమడు గణపతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అల్లూరి పెద కృష్ణంరాజు, గోపిశెట్టి సత్తిబాబు, బండారు శ్రీనివాస్, కుడుపూడి వెంకటేశ్వర్లు, వెలుగొట్ల త్రిమూర్తులు, సఖినాల గణపతి, కోళ్లరాంబాబు, అవిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సంజీవ్

పరీక్షా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రూరల్ గ్రామాలకు చెందిన టెన్త్ పరీక్షలకు సిద్ధమౌతున్న విద్యార్థులకు పెద్దనాపల్లి సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్షల సామగ్రిని అందజేశారు. ట్రస్ట్ ఛైర్మన్ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ రూరల్ ప్రాంతాల నుంచి టెన్త్ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచే విద్యార్థికి రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచే విద్యార్థికి రూ.7,500, తృతీయ స్థానాల్లో విద్యార్థికి రూ.5 వేలు అందజేస్తామన్నారు.



యాత్రికులను వివరాలు అడుగుతున్న ఎంఎల్ఎ సత్యానందరావు

మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శనివారం ఆయన వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పరిసరాలన్నీ ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరావుతో సందర్శించారు ఈ సందర్భంగా యాత్రికులను అడిగి సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాత్రికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రసాద్ పథకం ద్వారా రూ.90 కోట్లతో కేంద్ర ప్రభుత్వం సహకారం కోరనున్నట్లు తెలిపారు. వేసవి సమీపిస్తున్నందున యాత్రి కులకు ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక ఏర్పాట్లను చేస్తున్నట్లు పేర్కొన్నారు. యాత్రికులు ఇబ్బందులు దష్ట్యా రూ.1.30 కోట్లతో క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏడు ప్రదక్షణలు చేసుకునే యాత్రికులకు ఇబ్బందులు తరత్తకుండా స్వామివారి దర్శనం చేసుకుని బయటకు వచ్చే యాత్రికులకు ఎక్స్ లెటర్ వంటివి ఏర్పాటు చేసి యాత్రికుల ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. టాయిలెట్స్ నిర్మాణం, అన్నదాన భవనం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన స్వచ్ఛభారత్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు..ఆయనకు ముందుగా ఆలయ అధికారులు మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం స్వామివారి చిత్రపటం అందజేశారు.

నూకాంబిక జాతర నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరు నూకాంబిక అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా నిర్వహించనున్న ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు వివిధ శాఖల అధికారులతో ఆలయ ఆవరణలో శనివారం కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సమీక్ష నిర్వహించారు. ఆర్‌డిఒ పి.శ్రీకర్, డిఎస్‌పి సుంకర మురళీ మోహన్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్న ఈ సమావేశంలో సత్యానందరావు మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి జరగుతున్న అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసి యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు, భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో యాత్రికులు వచ్చే మార్గంలో చేపట్టిన పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. అనంతరం అమ్మవారి ఆలయం ఎదురుగా రూ.12 లక్షలతో షెడ్డు నిర్మాణం చేస్తున్న దాత దాసరి అమ్మిరాజును అభినందించారు. అలాగే వివిధ పనుల నిమిత్తం రూ.లక్ష విరాళం ఇచ్చిన వట్టికూటి సతీష్, రూ.60 వేల విరాళం ఇచ్చిన చంద్రు శ్రీనులను ఎంఎల్ఎ సత్యానందరావు అభినందించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

చింతలూరు గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. చింతలూరులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.15 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును, అలాగే రూ.15 లక్షలతో ఒఎన్‌జిజిసి(రూ.10 లక్షలు) పంచాయితీ రాజ్ శాఖ(రూ.5 లక్షలు)ల సంయుక్త సహకారంతో రైతుల అవసరార్థం ధాన్యం, ఎరువులు నిలవ చేసుకొనుటకు నిర్మించిన గోదామును నిర్మించారు. వీటిని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శనివారం ప్రారంభించి, శిలాపలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ అఖిల

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్‌డిఒ దేవరకొండ అఖిల శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి, నియోజక వర్గములో మండలముల వారీగా ఆన్‌లైన్‌లో వచ్చిన ఫారం-6 ధరఖాస్తులు 108 , ఫారం -7 దరఖాస్తులు 60, ఫారం -8 దరఖాస్తులు 274 మొత్తం 442 వచ్చినట్లు సమావేశంలో ఆర్‌డిఒ వివరించారు. సమావేశంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు అంశాలను ఆర్‌డిఒ దృష్టికి తీసుకువచ్చారు. టిడిపి నాయకులు ఎన్నికల సమయం లో ప్రభుత్వం తరపున వికలాంగులకు ఆటోలు ఏర్పాటు చేయాలనీ, పార్టీల పరంగా ఏర్పాటు జరగకూడదని విజ్ఞప్తి చేశారు. వైసిపి పార్టీ నాయకులు మాట్లాడుతూ ఇతర ప్రాంతముల నుండి వలస వచ్చిన వారికి ఓటు ఇవ్వాలని కోరారు. జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ రామచంద్రపురం మండలం జగన్నాయకులపాలెం శివారు కుడుపూడి వారి సావరం నందు కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశానికి టిడిపి, వైసిపి, జనసేన పార్టీ ప్రజా ప్రతి నిధులు పాల్గొన్నారు. కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు, మండల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ సమావేశానికి హాజరయ్యారు.

రోడ్డు పునర్నిర్మాణానికి డిమాండ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అధ్వానంగా ఉన్న ముమ్మిడివరం, అయినాపురం, కాట్రేని కోన రోడ్డు పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆ గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. మండల పరిధిలో ప్రధాన రహదారి అయినా ముమ్మిడివరం, అయినాపురం, కాట్రేనికోన రహదారిపై ప్రయాణం చేసే వారితో ఆదివారం ఉదయం అయినాపురం హైస్కూల్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన సమావేశానికి బాధిత గ్రామాల ప్రజలంతా హాజరుకావాలని అయినాపురం గ్రామస్తులు కోరారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఈ సమావేశం హాజరుకావాలని కాట్రేనికోన అయినాపురం రహదారి అభివృద్ధి కోసం ప్రజలంతా కలిసికట్టుగా ఉద్యమం చేపట్టాలన్నారు. పలు విషయాలు చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు.

బాల బాలాజీ స్వామి ఆదాయం రూ.2.08 లక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి దేవస్థానానికి వివిధ విభాగాల ద్వారా శనివారం రూ.2,08,980 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.8,002, నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.59,926 ఆదాయం సమకూరిందన్నారు.

ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కొత్తపేట

కళాశాల విద్యార్థులకు శనివారం వివిధ రంగాల్లో ఉపాధి ఆవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వికెవి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు సుమేధా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ అండ్ మేనేజ్మెంట్, వైజాగ్ నుంచి విచ్చేసిన వసంత, సువర్ణ విద్యార్థులకు హోటల్ మేనేజ్మెంట్, ఏవియేషన్, వివిధ రంగాలలోని ఉపాధి అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు ఈ పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించేందుకు వర్తమాన అంశాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ మీద పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ డిసిహెచ్.పాపారావు, కామర్స్ హెచ్ఒడి డాక్టర్ కె.సత్యనారాయణ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



పాల్గొన్న వికెవి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - రామచంద్రపురం

మైనార్టీల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. నావ జవాన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి మంత్రి సుభాష్ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్‌ను ముస్లిం పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మంత్రి సుభాష్

సంపూర్ణ ఆరోగ్యంతో మెరుగైన సమాజం

సంపూర్ణమైన ఆరోగ్యంతోనే మెరుగైన సమాజం నిర్మించుకోవచ్చునని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం సాయంత్రం రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయ నిధి నుంచి వివిధ గ్రామాలకు చెందిన 18 మందికి మంజూరైన రూ.29.44 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ మంజూరైన నిధులతో మెరుగైన చికిత్స పొంది త్వరగా కోలుకోవాలని మంత్రి సుభాష్ ఆకాంక్షించారు. చెక్కులు అందుకున్న పలువురు మంత్రి సుభాష్ కి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్షలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - అమలాపురం

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్షలు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బిఎల్ఎన్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం అమలాపురం కలెక్టరేట్లోని డిఆర్ఒ ఛాంబర్ లో ఈనెల 16న జరగనున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్షల నిర్వహణపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎపిపిఎస్‌సి నిర్వహిస్తున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి పరీక్షలకు జిల్లాలో 330 మంది అభ్యర్థులు హాజరుకానున్నరన్నారు. జిల్లాలో కాట్రేనికోన మండలం చెయ్యూరు గ్రామంలోని శ్రీనివాస ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, బట్లపాలెంలోని బివిసి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో ఆన్లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించనున్నారాన్నారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 8 నుంచి 8.45 గంటల్లోపు పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తారని తెలిపారు. 9 గంటల తర్వాత ఎవరిని కూడా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరన్నారు. పరీక్ష మొదలైన తర్వాత పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులను ఎవరని బయటకు పంపించరని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలలోకి ఎలక్ట్రానిక్ వస్తువులను మొబైల్ ఫోన్ లను అనుమతించారన్నారు. పరీక్షా కేంద్రాల్లోని ఇన్విజిలేటర్లు, పోలీసులు, హెల్త్ అసిస్టెంట్ల వద్ద కూడా మొబైల్ ఉండరాదన్నారు. ముమ్మిడివరం డిప్యూటీ తహశీల్దార్‌ను శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలకు, అల్లవరం డిప్యూటీ తహశీల్దార్‌ను బివిసి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలకు కోఆర్డినేటింగ్ ఆఫీసర్లుగా నియమించారన్నారు. వారు పరీక్షల నిర్వహణలో పూర్తి బాధ్యత వహించాలన్నారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ షాపులను మూసివేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అమలాపురం మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంబంధిత పరీక్షా కేంద్రాలలో పారిశుధ్యం నిర్వహించడంతోపాటు అభ్యర్థులకు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎపి ఇపిడిసిఎల్ అధికారులు పరీక్షా కేంద్రాలలో నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అమలాపురం రెవిన్యూ డివిజన్ అధికారి పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకునేలా సంబంధిత మార్గాలలో బస్సులు చెప్పాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ దుర్గారావు దొర, అమలాపురం మున్సిపల్ కమిషనర్ రాజు, ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ టి.నందగోపాల్, ముమ్మిడివరం డిప్యూటీ తహశీల్దార్ బి.గోపాలకృష్ణ, అల్లవరం డిప్యూటీ తహశీల్దార్ ఎ.సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.